క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు


పల్లకీలో పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

నేడు ఈరన్న స్వామి కానుకల లెక్కింపు
జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ హుండీలోని కానుకల లెక్కింపును మంగళవారం చేపట్టనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి సోమవారం తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


శివ మాల స్వీకరిస్తున్న శివభక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభాకర్ టాకీస్ పక్కన వెలిసిన శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం శివ భక్తులు శివ మాలను స్వీకరించారు. ముందుగా శివుడికిపంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం జ్యోర్తింగేశ్వరస్వామి వారికి 12 మెట్లతో పడిపూజ చేశారు. గురుస్వామి శైలేంద్రనాథ్ భక్తులకు శివ మాలధారణ విశిష్టత, నియమ, నిబంధనలు తెలియజేశారు.

ఘనంగా మద్వాచార్యుల ఆరాధన


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీమంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: మద్వానవమి సందర్భంగా సోమవారం స్థానిక మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో మద్వాచార్యుల ఆరాధనను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పూజారి గురురాజా ఆచారి మంగరాయ ఆంజనేయ స్వామికి, మద్వాచార్యుల విగ్రహానికి ఫలపంచామృతాభిషేకం, తేనాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు.

ఆదోని చేరిన 'ప్రత్యేక హోదా' యాత్ర


సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగుడు ప్రసాద్

ఆదోని అర్బన్: ప్రత్యేక హోదా డిమాండ్‌తో శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నియోజకవర్గం కంచిలి మండలం భోగాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రసాద్ చేపట్టిన ట్రైసైకిల్ యాత్ర సోమవారం ఆదోనికి చేరింది. ఈ సందర్భంగా ప్రసాద్.. సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.ప్రసాద్‌కు స్థానిక వికలాంగులు ఈరన్న, వెంకటేష్ తదితరులు మద్దతు పలికారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


వన్‌మన్ కమిషన్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకి నాయకులు

కోసిగి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోసిగి ఎంపీపీ ఈరన్న, వాల్మీకి నవసంకల్పం అధ్యక్షుడు నాగరాజు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏక సభ్య కమిటీ సమావేశంలో కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో వాల్మీకి నాయకులు హొళగుంద కోసిగయ్య, ముకుంద కిష్టప్ప, వెంకటేష్, బాపురం అంజి, బాలు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకుందాం
- ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


కొత్తూరులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ధ్యేయమని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం మండలంలోని మాంత్రికి, కొత్తూరు గ్రామాల్లో పర్యటించారు. మాంత్రికి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. అనంతరం ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని, మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎంపీడీఓ గీతావాణి, ఈఓపీఆర్‌డీ జనార్దన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పంచాయతీరాజ్ డీఈ ఖాదర్‌బాషా, ఏఈ మాలిక్‌బాషా, మండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డి, సర్పంచ్ బసవరాజు, ఎంపీటీసీ సభ్యుడు హనుమంతు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు మంజుల, రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీలక్ష్మి, రామలింగేశ్వరయాదవ్, గిడ్డయ్య, రామాంజి, తిప్పన్న, విరుపాక్షి, కోలప్ప, శంకర్, ఈరప్ప, లక్ష్మినారాయణ, తాయన్న, పీటర్, చిన్నఈరన్న పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి


గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిఅర్బన్: మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు నిర్వహించారు.గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమనోజ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవా, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు రేణుక, మంజుల, యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, కౌన్సిలర్లు చిన్నా,చలపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..
పట్టణంలోని గాంధీ పార్కులో ఉన్న గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠప్ప, దిలీప్‌దోకా, మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

ఆదోని అర్బన్: భార్య ఫిర్యాదు మేరకు భర్తపై పోలీసులు అదనపుకట్నం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తన భర్త అబ్దుల్‌ఖాదర్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని వన్‌టౌన్ పరిధిలోని ఖాజీపుర కాలనీకి చెందిన రెహనా పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మారెమ్మ దేవి దేవర


విద్యుద్దీపాల వెలుగులో మారెమ్మ దేవి ఆలయం

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో మంగళవారం నుంచి మారెమ్మ దేవి దేవర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడేళ్ల తర్వాత నిర్వహించే దేవర ఉత్సవాలకు ఆలయంతో పాటు వాడవాడలా విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి గ్రామంలో మారెమ్మ దేవిని వెండికవచ అలంకరణలు గావించి రథంపై కొలువుంచి ఊరేగింపుగా ఆలయం వరకు చేర్చి ప్రత్యేక పూజలతో దేవర ఉత్సవాలకు స్వాగతం పలుకుతారు. బుధవారం వేకువ జాము నుంచి ప్రతి ఇంటా పూర్ణకుంభంలో నైవేద్యం తయారు చేసి కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. దేవర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ఎరిసావలి, ఎస్‌ఐ రాజారెడ్డి గ్రామ పెద్దలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అల్లర్లకు పాల్పడితే గ్రామ పెద్దలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేడు హాల్విలో సిద్దేశ్వరుడి రథోత్సవం


పూజలందుకుంటున్న సిద్దేశ్వర స్వామి

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్దేశ్వర స్వామి జాతర సందర్భంగా మంగళవారం నిర్వహించనున్న రథోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

వేలం పాట వాయిదా

వెల్దుర్తి: స్థానిక పాతబస్టాండు సంత మార్కెట్‌లో పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 13 దుకాణాల కేటాయింపునకు బహిరంగ వేలం జనవరి 31వ తేదీన నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు ఈఓ జేమ్స్ కృపవరం తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ దుకాణాల వేలం ఫిబ్రవరి 4వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సారా బట్టీ ధ్వంసం

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్ తండా కొండ ప్రాంతాలలో సారా బట్టీలపై సోమవారం సెబ్ అధికారులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన దాడులలో 510 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులు ఎల్ తండా గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా వారిని జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఉదయం 9 గంటల్లోపు రూ.400 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు 7993760575, 9398034 565 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థినులు మౌనిక, నిత్యసాయి, హారికలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని హెచ్‌ఎం గౌసియాబేగం, పీడీలు సోమవారం తెలిపారు.

స్పందన సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్


స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: స్పందనలో వచ్చిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లడుతూ బాధితులను పదేపదే కార్యాలయాలకు తిప్పుకోవద్దన్నారు. సోమవారం స్పందనలో స్వీకరించిన అర్జీలను శనివారంలోపు పరిష్కరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాలన్నారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరామమోహన్, ఆర్టీఓ శివారెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఎస్‌డబ్ల్యూఓ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీదారుల్లో కొన్ని..
- ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని వేరేవారు ఆక్రమించుకున్నారని విచారించి న్యాయం చేయాలని కోసిగి మండల కేంద్రానికి చెందిన బంగారమ్మ విన్నవించుకుంది.
- తన తల్లి పేరుతో ఉన్న 3 ఎకరాల భూమిని ఇతరులు ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విచారించి న్యాయం చేయాలని ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి చెందిన ఇందిరమ్మ వేడుకుంది.
- తనకు సర్వే నంబర్ 60సీ -1-44పైకి 0.94 సెంట్లు భూమి ఉందని, కానీ ఆన్‌లైన్‌లో 0.74 సెంట్లు భూమి మాత్రమే చూపుతుందని, మిగతా 0.20 సెంట్లను కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని హొళగుంద మండలానికి చెందిన పి.రామిరెడ్డి కోరారు.

హాస్టల్ తనిఖీ

ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మండిగిరి గ్రామ పంచాయతీలో ఉన్న బీసీ హాస్టల్‌ను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన, వసతి, మెరుగైన సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తనకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

గ్రామస్తులతో సీఐ సమావేశం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో సీఐ శ్రీనివాసులు సోమవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని, గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి, మహిళల రక్షణకు తీసుకువచ్చిన పలు పథకాల గురించి వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపిన వివరాలు.. ఆదోని మండలం చిన్నహరివాణం క్రాస్ రోడ్డు వద్ద అల్పానూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ స్కూటర్‌పై లగేజీ బాగ్‌లో 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లు రవాణా చేస్తుండగా గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు


గొరవయ్యలు నృత్యం చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో జలకలశం ఊరేగింపు

ఆదోని రూరల్: నాగదేవత విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని నెట్టేకల్ గ్రామంలో సోమవారం శ్రీశైలం జలాలను, కలశాలను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గొరవయ్యల నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం నవగ్రహ పూజ అనంతరం నాగదేవత విగ్రహ ప్రతిష్ట, హోమం, ఫిబ్రవరి 1న గోపుర కలశ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

నేడు సిద్ధేశ్వర స్వామి రథోత్సవం


హొళగుందలో సిద్ధమైన తేరు

హొళగుంద: చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవమైన హొళగుంద సిద్ధేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. మంగళవారం రథోత్సవం, ఫిబ్రవరి 1న లంకాదహనం, 2న వసంతోత్సవ కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. 1వ తేదీ స్థానిక కళాకారులచే 'కలియుగదల్లి ఘర్జిసిద కర్ణార్జున' అర్థాత్ ఒడ హుట్టిదవరు, అనే సామాజిక కన్నడ నాటకం ప్రదర్శించనున్నారు. బుధవారం జరిగే లంకాదహనం రోజు రూ.లక్షలు ఖర్చు పెట్టి వివిధ రకాల బాణసంచా కాల్చడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి అన్ని వర్గాల ప్రజలు తరలి వస్తారు. చిన్నారుల కోలాటాలు, పెద్దల బల ప్రదర్శన పోటీలు ఆకర్షణగా నిలవనున్నాయి

నేడు భద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవం
పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామంలో మంగళవారం భద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవానికి గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి ఎదుర్కోలు, గణారాధన, ఆయ కట్టుదారులకు అన్నదానం చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో భజన చేశారు. మంగళవారం 9:25 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి 9 గంటలకు ప్రభోత్సవం, గురువారం వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

పొదుపు.. అభివృద్ధికి మలుపు

- ఏటేటా పెరుగుతున్న పొదుపు సంఘాలు
- అండగా నిలుస్తున్న ప్రభుత్వం


పొదుపు సంఘం సభ్యుల సమావేశంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోసిగి: పొదుపుతో మహిళలు అభివృద్ధి బాటలో నడుస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళాభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. మహిళలు చైతన్యవంతులై పొదుపు గ్రూపులో చేరి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. కోసిగి మండలంలో 1,420 పొదుపు గ్రూపుల్లో 14,200 మంది మహిళలు ఉన్నారు.. ఈ రెండేళ్లలో మరో 351 గ్రూపులు కొత్తగా ఏర్పడ్డాయి. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు, బ్యాంక్ లింకేజీ రుణాలు, వైఎస్సార్ చేయూత పథకాలు అమలు చేసి అండగా నిలుస్తోంది.

వైఎస్సార్ ఆసరా..
ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అప్పటికి బ్యాంక్‌లో ఎంత రుణం ఉందో వైఎస్సార్ పథకం కింద విడతల వారీగా వారివారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తోంది. ఇప్పటి వరకు రెండు విడతలు జమ చేశారు. కోసిగి మండలంలో మొదటి విడతలో 851 గ్రూపులకు రూ.4.92 కోట్లు, రెండో విడతలో 870 గ్రూపులకు రూ.5.12 కోట్లు మంజూరైంది. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 845 గ్రూపులకు 8,590 మంది లబ్ధిదారులకు రెండు విడతల్లో రూ.9.84 కోట్ల రుణాలు మంజూరు చేశారు. బ్యాంక్ లింకేజీ ద్వారా 852 గ్రూపులకు మండలంలోని స్టేట్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, కందుకూరు సిండికేట్ బ్యాంక్‌ల నుంచి రూ.25 కోట్ల రుణాల లావాదేవీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మహిళలు చైతన్య వంతులుగా మారి వ్యాపార రంగాల్లోనూ, పాడి గేదెలు, గొర్రెలు, ఆవులు పెంపకం చేపట్టడం, కిరాణం, పాల వ్యాపారం, దుస్తుల వ్యాపారం, కుట్టుమిషన్లు తదితర జీవనోపాధితో తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు.

మహిళలను చైతన్యవంతం చేస్తాం



మహిళలను చైతన్యవంతులుగా చేసి ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సహిస్తున్నాం. రెండేళ్లలో కోసిగి మండలంలో కొత్తగా 351 పొదుపు గ్రూపులును ఏర్పాటు చేసి వారికి బ్యాంక్ లింకేజీ రుణాలు అందించాం . అర్హులైన ప్రతి ఒక్క గ్రూపు సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేస్తున్నాం.

– సత్యమ్మ, ఏపీఎం

గొర్రెలు పెంపకం చేపట్టాను



ఐదేళ్ల క్రితం పొదుపులో చేరాను. బ్యాంక్ లింకేజీ ద్వారా రెండు సార్లు రూ.50వేల చొప్పులు బ్యాంక్ రుణం తీసుకున్నాను. ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కింద రెండు సార్లు రూ.18,500 చొప్పున నా ఖాతాకు జమచేసింది. ఆ నగదుతో 5 గొర్రెలు కొనుక్కొని పెంచుకుంటున్నా.

– దేవకమ్మ, జంపాపురం

ఆవులు కొనుక్కున్నా



రాజేశ్వరి పొదుపు సంఘంలో సభ్యురాలిగా 10 ఏళ్ల నుంచి కొనసాగుతున్నాను. ప్రభుత్వం వచ్చి రెండు సార్లు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.16 వేల చొప్పున ఇచ్చింది. చేయూత కింద వచ్చిన నగదుతో రెండు ఆవులు కొనుక్కున్నా. ఆవు పాలు విక్రయిస్తూ మా కుటుంబానికి అండగా ఉన్నా.

– చాకలి ఈరమ్మ, జంపాపురం

పొదుపు కుటుంబానికి భరోసా



పొదుపు సంఘం కుటుంబానికి భరోసాగా నిలిస్తోంది. గ్రామైక్య సంఘం లీడర్‌గా పనిచేశాను. చాలా మంది మహిళలను చైతన్యవంతులు చేసి బ్యాంక్ రుణాలు ఇప్పించాను. పొదుపు రుణాలు తీసుకుని దుస్తుల వ్యాపారంలో రాణిస్తూ మా ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాను. వారికి కూడా వైఎస్సార్ ఆసరా కింద ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున మంజూరైంది.

– ఇందిర, కోసిగి

వాహనాల వేలంలో రూ.6.26 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 23 వాహనాలకు స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో సోమవారం సీఐ జయరాంనాయుడు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఒక కారు, మూడు ఆటోలు, 19 బైకులకు వేలం నిర్వహించగా అన్నీ అమ్ముడుపోయాయి. వాహనాలకు ప్రభుత్వ ధర రూ.2,14,000 కాగా వేలం ద్వారా రూ.6,26,500 లభించినట్లు చెప్పారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి

వెల్దుర్తి: రైతులు చిరుధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలని, తక్కువ కాలంలో దిగుబడులు చేతికి రావడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరతో లాభాలు ఆర్జించవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం పురస్కరించుకుని జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్బీకేలో ఏఓ అక్బర్‌బాష ఆధ్వర్యంలో రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులచే చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపే ప్లకార్డుల ర్యాలీ ఆకట్టుకుంది. ఆర్బీకేలో జరిగిన అవగాహన కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ చిరుధాన్యాలు (నవధాన్యాలు) అయిన జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు సాగు చేయాలని రైతులకు సూచించారు. చిరుధాన్యాలు తినడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, వాటి ఆవశ్యకతను వివరించారు. చిరుధాన్యాల వంటకాల స్టాల్, చిరుధాన్యాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన ఆహార చక్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్నూలు డాట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, గుంటూరు వ్యవసాయ కమిషన్ రాష్ట్ర కార్యాలయ వ్యవసాయాధికారి విశ్వేశ్వరప్ప, జిల్లా వ్యవసాయ సలహా మండలి పట్టు పరిశ్రమ సభ్యుడు సమీర్‌రెడ్డి, ఏడీఏలు విజయ్‌కుమార్, బాలవర్ధి రాజు, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ తదితరులు పాల్గొన్నారు.